## విద్యా ప్రగతి విహార్‌కు సొబగులు



ముస్తాబైన హాస్టల్ ప్రారంభోత్సవ సమయంలో విద్యార్థినుల సందడి(ఫైల్)

- రూ.30 లక్షలతో ఆధునికీకరణ
- టాయిలెట్స్ బ్లాక్స్, మెస్, బెడ్స్ ఏర్పాటు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతి గృహం విద్యా ప్రగతి విహార్‌కు నూతన సొబగులు అద్దుకుంది. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా హాస్టల్ భవనాన్ని ఆధునికీకరించారు. వర్సిటీకి చేరువలో ఉండే ఈ హాస్టల్‌ను విద్యార్థులకు ఉపయుక్తంగా మరమ్మతులు చేపట్టారు. వంటశాల, భోజన శాల, టాయిలెట్స్ బ్లాక్స్‌ని సుమారు రూ.30 లక్షల నిధులతో పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. నాడు-నేడు పథకం స్ఫూర్తితో ఈ హాస్టల్ భవన స్వరూపాన్నే పూర్తిగా మార్చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రగతి వసతి గృహం మరమ్మతుల విషయంపై అధికారులు దృష్టిసారించలేదు. ఈ క్రమంలో గతంలో పరిశీలించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తక్షణం మరమ్మతులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఆధునికీకరణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. వెంటనే పనులు ప్రారంభించిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘన స్వాగతం పలికేలా హాస్టల్ గదులు, భవనాన్ని తీర్చిదిద్దారు.


నూతనంగా నిర్మించిన టాయిలెట్స్ బ్లాక్

### ఇది కదా అభివృద్ధి


గదుల్లో ఏర్పాటు చేసిన మంచాలు


విద్యార్థులతో వసతులపై మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

**ప్రణాళికతో ఏకకాలంలో..**

పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేశారు. ప్రతి అంతస్తులో టాయిలెట్స్ బ్లాక్‌ని అభివృద్ధి చేశారు. విద్యార్థుల గదులకు అవసరమైన తలుపులు, కబోర్డ్ రిపేర్‌లు, కొత్తవి ఏర్పాటు చేశారు. భవనానికి చుట్టూ పటిష్టత చేకూర్చే ప్లింత్ ప్రొటెక్షన్, కార్పెంటరీ వర్క్‌లు, ఎలక్ట్రికల్ పనులు, డైనింగ్ హాల్, కిచెన్‌ను ఆధునికీకరించారు. వీటన్నింటిని ఏక కాలంలో సమాంతరంగా పూర్తి చేశారు. భవనం లోపల, బయట పెయింటింగ్ వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఆధునికీకరించిన హాస్టల్‌ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వయంగా విద్యార్థులతో ప్రారంభింపచేశారు. 50 గదులను 150 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కేటాయించారు. రీడింగ్ రూమ్, ఆర్‌వో వాటర్ సదుపాయం,ఏడు గ్రీజర్లు, వ్యక్తిగత బెడ్లు ఏర్పాటు చేశారు.

**షెడ్ పునర్నిర్మాణం**

ప్రగతి హాస్టల్ వెనక భాగంలో ఒక పెద్ద షెడ్ నిరుపయోగంగా ఉంది. దీని రేకులు విరిగిపోయి శిథిలావస్థకు చేరుకుంది. దీనిని పూర్తిగా తొలగించకుండా కొద్దిపాటి ఖర్చుతో ఈ షెడ్‌కు పూర్వవైభవం తీసుకువస్తూ పునర్నిర్మించారు. దీనిలో హాస్టల్ కార్యాలయం, విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చినపుడు ఉండటానికి వీలుగా డార్మెంటరీ వంటివి కల్పించేలా తీర్చిదిద్దారు.

**హాస్టల్ వాతావరణం బాగుంది**



తొలిసారిగా హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. హాస్టల్‌లో వాతావరణం చాలా బాగుంది. హాస్టల్‌ని ఇటీవల పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. హాస్టల్ పరిసరాలు, ప్రాంగణం ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయి. చుట్టూ పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

– మోనిక, విద్యార్థిని, ఏయూ మ్యాథ్‌మెటిక్స్ విభాగం

## గర్భాశయ క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

**బీచ్ రోడ్డు:** చాలా మంది మహిళలను పట్టిపీడిస్తున్న గర్భాశయ క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పలువురు వైద్యులు అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంలో గర్భాశయ క్యాన్సర్ తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీనిని సెర్వవాక్ వంటి వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చునన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలి

**విశాఖ విద్య:** ఆడుదాం ఆంధ్రా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల అప్పలరాజు కోరారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సెలవు రోజుల్లో పనిచేసిన కాలానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. లలితకుమార్, కోశాధికారి ఎస్. రామకృష్ణ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తెలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవికుమార్


రవికుమార్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

**బీచ్ రోడ్డు:** తెలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పెబ్బిలి రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిరిపురంలోని ఓ హోటల్‌లో ఆదివారం అఖిల భారతీయ తెలిక్ సాహు మహాసభ సమావేశం జరిగింది. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు జయదత్ క్షీరసాగర్.. రవికుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సత్కరించి అభినందించారు.

### 681 మందికి వైద్య పరీక్షలు

**ఆరిలోవ:** జిమ్మర్స్, గీతం ఆస్పత్రుల ఆధ్వర్యంలో పెదగదిలి కూడలిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో పెదగదిలి, చినగదిలి, సింహగిరికాలనీ, సంజయ్‌గాంధీకాలనీ తదితర ప్రాంతాల నుంచి 681 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఇతర వైద్య పరీక్షల కోసం వీరిలో 30 మందిని గుర్తించారు. వారికి సోమవారం గీతంలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.

### శ్రావ్యంగా గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న నారాయణ్ బృందం

**మద్దిలపాలెం:** విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకు చెందిన ప్రముఖ గాత్ర విద్వాంసుడు విద్వాన్ పయోలోరి నారాయణ్ గాత్ర కచేరీ శ్రావ్యంగా సాగింది. కచేరీలో వయోలిన్‌పై విద్వాన్ పప్పు జ్ఞానదేవ్, మృదంగంపై విద్వాన్ మండపాక రవి, ఘటంపై నగరానికి చెందిన కౌంటిన్య సహకరించారు. ముందుగా వీఎంఏ కార్యదర్శి శ్రీనివాస్, భుజంగరావు, కృష్ణారావు, జ్వాలాప్రసాద్, తదితరులు అతిథులుగా పాల్గొన్ని జ్యోతి ప్రజ్వలన చేశారు.

### ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మద్దిలపాలెం డిపో వద్ద నిరసన చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

**మద్దిలపాలెం:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మద్దిలపాలెం డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సిబ్బంది, సీనియార్టీ ప్రకారం చార్టులు వేయాలన్నారు. తమ కోసం ఇచ్చిన 1–2019 సర్క్యులర్‌ను యథాతథంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎం.ఇ.రావు, కార్యదర్శి పాలపర్తి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

### నేడు సింహగిరిపై సీతారాముల శాంతి కల్యాణం

**సింహాచలం:** సింహగిరిపై గంగధార వద్ద ఉన్న పురాతన సీతారామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కల్యాణంతో పాటు ఇతర పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈవో కోరారు.

## ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ


వీసీ ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మొల్లి అప్పారావు


వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న విదేశీ విద్యార్థులు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు అభినందించారు. వీసీని ఆదివారం తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గత నాలుగేళ్లలో ఏయూను ఎంతో అభివృద్ధి చేశారని, రానున్న కాలంలో మరింత ప్రగతి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పులగం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**విదేశీ విద్యార్థుల అభినందనలు**

వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని విదేశీ విద్యార్థులు ఆత్మీయంగా సత్కరించారు. వర్సిటీ జియో ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధకులుగా ఉన్న ఇద్దరు విదేశీయులు ప్రత్యేకంగా వీసీకి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. మంచి సమర్థత కలిగిన ప్రసాదరెడ్డిని ఏయూకు రెండోసారి వీసీగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. థ్యాంకూ సీఎం సార్ అంటూ ప్లకార్డుతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.


ప్రసాదరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్

**మద్దిలపాలెం:** ఏయూ వీసీగా రెండోసారి నియామకమైన ఆచార్య ప్రసాద్‌రెడ్డికి ఏపీ బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, తదితరులు అభినందనలు తెలిపారు. వీసీని తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమం సాధ్యం


వృద్ధునితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

**ఆరిలోవ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా జీవీఎంసీ 10వ వార్డులో ఆదివారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి వార్డులోని 24, 25 నంబర్ల సచివాలయాల పరిధి సుందర్‌నగర్, ఆదర్శనగర్ కొండవాలులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో అమలవుతున్న పలు సంక్షేమ పథకాలకు సంబంధించి కర పత్రాలు అందజేశారు. వాటి వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలన, అందిస్తున్న సంక్షేమ ఫలాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎప్పుడూ లేని విధంగా పేద, బడుగు వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గడపగడపకు వెళుతున్నప్పుడు సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, ఎస్సీ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, బీసీ విభాగం డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు, వైల్డ్‌లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, స్థానిక నాయకులు పతివాడ కనకరాజు, బొండా శ్రీనివాసరావు, కె.ఎస్.చలం, వరలక్ష్మి, కృష్ణ, ఆనంద్, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకులం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

**ఆరిలోవ:** ముడసర్లోవ పార్కు ఆదివారం సందడిగా మారింది. ఇక్కడ పలు సంఘాలు, పూర్వ విద్యార్థులు వనభోజనాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణాపురం గురుకులంలో 1988 నుంచి 1994 సంవత్సరం వరకు పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అందరూ ముడసర్లోవలో కలిశారు. నగరంలో పాటు వివిధ జిల్లాల్లో వృత్తిరీత్యా స్థిరపడిన వారు, అమెరికాలో ఉద్యోగరీత్యా స్థిరపడినవారు సైతం ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. వారంతా రోజంతా ఇక్కడ సరదాగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతాకలసి ఆటపాటతో ఎంజాయ్ చేశారు. ప్రస్తుతం ఎక్కడెక్కడ స్థిరపడ్డారు.. ఏయే వృత్తుల్లో ఉన్నారో పరిచయం చేసుకున్నారు. భవిష్యత్‌లో అవసరాలకు అనుగుణంగా వారంతా ఒకరికొకరు సహకారం అందించుకోవాలని తీర్మానించుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు డి.రోజాపుష్పం, దీనవల్లి, డి.రామకృష్ణను ఘనంగా సత్కరించారు. అనంతరం అంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.పైడిరాజు, సీహెచ్.వి.అప్పారావు, ఎర్రజీ, వరాహ నర్సింహం, ఈగల అప్పారావు, పైడిరాజు, రమణ, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## ఏయూ మైదానంలో శ్రమదానం


చీపురు పట్టి వ్యర్థాలను ఊడ్చుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల సంక్రాంతి సంబరాలు నిర్వహణ కారణంగా ఈ మైదానం ఉన్న పేరుకుపోయిన వ్యర్థాలను స్వయంగా ఏరివేశారు. ఉత్సవాలు తరువాత తమ వంతు బాధ్యతగా 50 మంది కార్యకర్తలతో వచ్చి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సేకరించిన చెత్తను గోనె సంచులలో కట్టి పారిశుధ్య కార్మికులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు టి.భారతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధోని నాగరాజు, కూరాడ పావని, రామకృష్ణ, కె.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

## అలవోకగా 150 పద్యాల ఆలాపన


డాక్టర్ పెదవీర్రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

**మహారాణిపేట:** విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ అంకోశ హాల్‌లో తెలుగు పద్య సౌరభం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ ఈదర పెదవీర్రాజు ప్రముఖ కవులు రాసిన పద్యాలను అలవోకగా ఆలపించారు. 150 పద్యాలను ఏకధాటిగా చదవి కవులు, రచయితలను ఔరా అనిపించారు. గణనాథుడి పద్యంతో మొదలై 150 పద్యాలు చదవి వినిపించారు. సమకాలీన అంశాలను ఆధారంగా చేసుకొని ఆయన ఇంత వరకు పలు కవితలు రాశారు. తెలుగు భాష, పద్యాలపై తనకున్న పట్టుతో నన్నయ్య, తిక్కన, తిరుపతి వెంకట కవులు, దాశరథి తదితర కవుల నుంచి వచ్చిన పలు పద్యాలను, వాటి సారాంశాన్ని డాక్టర్ పెదవీర్రాజు చదవి వినిపించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో ఆయన వినిపించారు. డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, ముఖ్య అతిథి డాక్టర్ మీగడ రామలింగస్వామిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## ముగిసిన హోటల్స్ అసోసియేషన్ సమావేశాలు


స్వామిని సత్కరిస్తున్న శ్యామ్‌రాజు

**బీచ్ రోడ్డు:** నగరంలోని ఓ హోటల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సౌత్ ఇండియా హోటల్స్ అండ్ రెస్టారెంట్ వార్షిక సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ఎంపీ జీవీఎల్ నరసింహారావు పాల్గొని పలు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్‌రాజు మాట్లాడుతూ మూడు రోజుల పాటు 35 మంది అనుభవజ్ఞులతో విశాఖలో టూరిజం అభివృద్ధి ప్రభుత్వం సహకారం, సవాళ్లు, పరిష్కారంపై చర్చించామన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశామని, వీటిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అభివృద్ధికి విశేష సేవలందించిన ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామిని ఘనంగా సత్కరించారు.

## రహదారి భద్రతతో సురక్షిత ప్రయాణం


రహదారి భద్రతపై మద్దిలపాలెం కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పోలీసులు

**మద్దిలపాలెం:** రహదారి భద్రతతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని ఇన్‌చార్జి ఆర్‌టీవో వేణుగోపాలరావు అన్నారు. మద్దిలపాలెం కూడలిలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు పెట్టుకోవాలని, తదితర ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డులు ప్రదర్శించారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతున్న వారి వద్దకు వెళ్లి అభినందనలు తెలుపుతూ చాక్లెట్లు, పువ్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు గణేష్‌రెడ్డి, మన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కైలాసనాథుని ఆలయ వార్షికోత్సవం


కైలాసగిరిపై అలంకరించిన కైలానాథుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

**ఆరిలోవ:** నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరి కొండపై కొలువైన కైలాసనాథుని ఆలయ 73వ వార్షికోత్సవం వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు చేశారు. కైలాసగిరికి వెళ్లిన సందర్శకులతో పాటు విశాలాక్షినగర్, అప్పుఘర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కె.కాశీ స్వామి భక్తుల పేరిట అర్చనలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన కోలాటం, భజనలు అలరించాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు, సందర్శకులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.


విద్యుత్ దీపాలు, పూల అలంకరణలో ఆలయం

## సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కొత్త ఐసీయూ ప్రారంభం


కొత్త ఐసీయూను ప్రారంభిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ అశోక్‌కుమార్

**మహారాణిపేట:** కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని యూరాలజీ వార్డులో ఆరు పడకలతో న్యూ ఐసీయూను ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో యూరాలజీ ఐసీయూ కోసం భావనగర్ వార్డుకు తీసుకొని వెళ్లేవారని, నేడు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే ఐసీయూ పెట్టడం వల్ల రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ డీసీహెచ్‌ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీ తులసి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భైరవస్వామి ఆలయం వద్ద క్యూలైన్ల ఏర్పాటు


క్యూలైన్లను పరిశీలిస్తున్న ట్రస్టీలు, ఏఈఈ

**సింహాచలం:** భైరవస్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో దేవస్థానం అధికారులు పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఉచిత దర్శన క్యూలు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో షెడ్ నిర్మాణం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. స్వామికి అభిషేకం నిర్వహించిన తర్వాత నీరు బయటకు వెళ్లేందుకు ప్రత్యేకంగా డ్రైనేజీ నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, ఏఈఈ హరి ఆదివారం సంబంధిత ఏర్పాట్లు పరిశీలించారు.

## నేటి నుంచి పోలమాంబ జాతర

**దాబాగార్డెన్స్:** జీవీఎంసీ 30వ వార్డు కుమ్మర వీధిలో వెలసిన పోలమాంబ అమ్మవారి 66వ వార్షిక జాతర ఈ నెల 22, 23 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం తొలేళ్ల సంబరం జరపనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం పరస జరగనుంది. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం, భక్తుల సమక్షంలో ముత్తయిదువులతో ఘటాభిషేక ఉత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి పురవీధుల గూండా ఊరేగింపు, విద్యుత్ దీపాలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. పౌరాణిక వేషధారణలు, సాముగరడీలు, దాసుళ్ల సందళ్లు, డీజే వాయిద్యాల హోరుతో మహోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. బుధవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేస్తామన్నారు.